క్లుప్తంగా

రైతులకు రుణాల పంపిణీ



మంగళగిరి : మంగళగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో బుధవారం కాజ , చినకాకాని, ఆత్మకూరు, మంగళగిరి రైతులకు క్రాఫ్ లోను, క్యాష్ క్రెడిట్ లోనుకు సంబంధించిన రూ.22.80 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం చైర్‌పర్సన్ గాదె పిచ్చిరెడ్డి, డైరెక్టర్లు అందె శివశంకరరావు, వాసా వేణుకుమార్, సీఈవో రాయల రమేష్‌బాబు పాల్గొన్నారు.

పనిగంటలు పెంచడం అన్యాయం



దుగ్గిరాల: కూటమి ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికులు పని గంటలు పెంచుతూ అసెంబ్లీలో బిల్ తేవడాన్ని అన్యాయమని సీపీఎం నాయకుడు వై.స్టాలిన్ పేర్కొన్నారు. బిల్లును ఉపసంహరించుకోవాలని కోరుతూ మంచికలపూడి గ్రామ ఈఓకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 8 గంటల పని పద్ధతిని 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో బిల్లుపై ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వై.బ్రహ్మేశ్వరరావు, ఎ.పాములు, ఎం.సుందరావు, వి.శేష గిరిరావు, సుధ, మౌనికా తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి కృషి



ఫిరంగిపురం: గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ అన్నారు. మండలకేంద్రంలోని గాలిబాలి శాఖ గ్రంథాలయాన్ని బుధవారం పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో భవనం దెబ్బతిని ఉండటాన్ని గమనించారు. మరమ్మతులు చేయించాలని గ్రంథాలయాధికారి వెంకట దుర్గారెడ్డిని ఆదేశించారు. గ్రంథాలయంలోని పుస్తకాలను, రికార్డులను, రిజిస్టార్లను ఆమె పరిశీలించి, పాఠకులతో కొద్దిసేపు మాట్లాడారు. పాఠకులకు కావల్సిన పుస్తకాల వివరాలు అడిగితెలుసుకున్నారు. వాటిని తెప్పించేందుకు ప్రయత్నించాలని చెప్పారు. ఆమె వెంట రాష్ట్రగ్రంథాలయ పరిషత్ మెంబర్ ఎం.పద్మజా, గ్రంథాలయ సిబ్బంది ఉన్నారు.

రేవేంద్రపాడులో పొలం పిలుస్తోంది



దుగ్గిరాల: రానున్న రెండు రోజుల్లో అధిక వర్షాలు పడే అవకాశం దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ ఆర్.విజయ బాబు సూచించారు. బుధవారం దుగ్గిరాల మండలంలోని రేవేంద్రపాడు, మోరంపూడి గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది నిర్వహించారు. అనంతరం ఆయన రైతులను ఉద్దేశించి వర్షపాతం ఎక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఖరీఫ్ సాగు చేస్తున్న రైతులు సెప్టెంబరు 30వ తేదీ గడువు లోగా ప్రతి ఒక్క రైతు ఈ పంట నమోదు చేయించుకోవాలని కోరారు.

జాబ్‌మేళాలో 102 మందికి ఉద్యోగాలు



తాడికొండ: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ(సీఆర్డీయే) ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి– శిక్షణ శాఖ సౌజన్యంతో తుళ్లూరులోని సీఆర్డీఏ స్కిల్ హబ్ ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహించారు. 450కి పైగా ఉద్యోగాలు భర్తీ చేసేందుకు నిర్వహించిన ఈ జాబ్ మేళాకు 247 మంది అభ్యర్థులు హాజరు కాగా 102 మంది ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన పలువురు అభ్యర్థులకు ఆయా కంపెనీల హెచ్‌ఆర్ విభాగ ప్రతినిధులతో కలసి సీఆర్డీఏ సామాజిక సంక్షేమ విభాగం డీసీడీఓ బొర్రా శ్రీనివాసరావు ఎంపిక లెటర్లు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ అధికారి అరుణ కుమారి, సీఆర్డీఏ సీనియర్ లైవ్‌లీహుడ్ ఆఫీసర్ శంకర్, జూనియర్ లైవ్‌లీహుడ్ స్పెషలిస్టులు క్రాంతికుమార్, నరసింహం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నరసింహస్వామి ఆలయంలో ధాన్యలక్ష్మి దేవి అలంకారంలో...



శివాలయంలో దుర్గాదేవి అలకారంలో దర్శనం



కాళీమాత ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు




అన్నపూర్ణ అవతారంలో అమ్మవారు



ఎల్బీనగర్‌లో అన్నపూర్ణ దేవి అలంకారంలో దర్శనం



కాశీ అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చిన మహంకాళీ అమ్మవారు



తాడేపల్లిలో గాయత్రి అలంకారంలో అమ్మవారు



రెడ్ల రామమందిరంలో గాయత్రి అలంకారం..

దేవీ దర్శనం... సర్వపాప హరణం

శరన్నవరాత్రి ఉత్సవాల శోభ

మంగళగిరి టౌన్: దసరా శరన్నవరాత్రుల మూడో రోజైన బుధవారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వివిధ అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. పలు అమ్మవారి ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు, సామూహిక అర్చనలు చేశారు.

లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో....

మంగళగిరి నగరంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం అమ్మవారు ధాన్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలంకార కైంకర్యపరులుగా మంగళగిరికి చెందిన వంగర శ్రీనివాసమూర్తి, లక్ష్మీ గాయత్రి దంపతులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు లలితా పరమేశ్వరి వ్యవహరించారు.

శివాలయంలో.....

మంగళగిరి నగరంలోని గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు బుధవారం దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గోపి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కనకదుర్గమ్మ వారి ఆలయంలో..

పాత మంగళగిరి దుర్గ నగర్ బైపాస్ వెంబడి ఉన్న కనకదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో అమ్మవారు గాయత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కోటిపల్లికి చెందిన నాదస్వర కచేరి, నగరానికి చెందిన నృత్యకళాకారులు చేసిన నృత్యాలు, భరతనాట్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ నిర్వాహకులు ఇంటూరి దుర్గాప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



దోకిపర్రులో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కాళీమాత ఆలయంలో..

మంగళగిరి పట్టణ పరిధిలోని గౌతమ బుద్ధ రోడ్ రాజీవ్ గృహకల్ప రోడ్డు వెంబడి ఉన్న కాళీమాత ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు.

అన్నపూర్ణగా మూలాంకురేశ్వరి

ఫిరంగిపురం: నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం అమీనాబాద్ గ్రామంలోని మూలాంకురేశ్వరి అమ్మను అన్నపూర్ణగా అలంకరించి అర్చకులు అయ్యన్నశాస్త్రి విశేషపూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బి. వేణుగోపాల బాబు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

మంగళగిరి: నగరంలో దసర శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఎల్బీనగర్‌లో అమ్మవారు బుధవారం మూడవ రోజు అన్నపూర్ణ దేవిగా దర్శనమివ్వగా, బైపాస్ రోడ్డులోని కనకదుర్గానగర్‌లో కల ఆలయంలో గాయత్రి దేవి అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు.



మంగళగిరి కనక దుర్గానగర్‌లో గాయత్రీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

దుగ్గిరాల: మండలంలోని ప్రసిద్ధ కంఠంరాజుకొండూరులోని శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు కాశీ అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వచనాలు తీసుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను కార్యనిర్వహణ అధికారి కె.సునీల్ కుమార్ పర్యవేక్షించారు.

అన్నపూర్ణాదేవిగా పోలేరమ్మ

మేడికొండూరు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మేడికొండూరు మండలం డోకిపర్రు గ్రామంలోని పోలేరమ్మ దేవాలయం వద్ద దసరా వేడుకలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త, మేడికొండూరు జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్దయ్య ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు.



ఉండవల్లిలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

మూడవ రోజుకు చేరిన దసరా ఉత్సవాలు

తాడేపల్లి రూరల్: పట్టణ పరిధిలోని గంగా బాల త్రిపుర సుందరీదేవి రాజరాజేశ్వరి సమేత త్రిపుర తాండేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉండవల్లి రెడ్ల రామమందిరంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవి అలకారంలో అలకంరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సుహాసిని, కుంకుమ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఉదయం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంగళగిరి, తాడికొండ సమన్వయకర్తలు దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్), వనమా బాల వజ్రబాబు పాల్గొన్నారు. – సాక్షి నెట్ వర్క్

హక్కుల సాధన లక్ష్యంతో బీసీలు ఉద్యమించాలి

మంగళగిరి టౌన్: సంఘ నిర్మాణ పటిష్టత కోసం బీసీల హక్కుల సాధన లక్ష్యాలతో ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో నాయకులు, కులసంఘాల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశన మాట్లాడుతూ బాపట్ల జిల్లాలోని అన్ని స్థాయిల్లో సంఘ నిర్మాణం పూర్తిచేసి గ్రామగ్రామాన బీసీ జెండాలు ఎగిరేలా కృషి చేయాలన్నారు. బాపట్ల జిల్లాలోని యువజన విభాగంలో పలువురు బీసీ సంఘంలో చేరారు. రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్ మాట్లాడుతూ గంజాయి, కొకైన్ వంటి మాదక ద్రవ్యాల జోలికి పోకుండా యువతను చైతన్యపరచి సంఘ బలోపేతానికి కృషి చేద్దామన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలు, బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం, చట్టసభల్లో, స్థానిక సంస్థల్లో బీసీల జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, బాపట్ల జిల్లా యువజన అధ్యక్షులు గంగరాజు, నాయకులు తిరువీధుల కిరణ్, ధనుంజయ్ పాల్గొన్నారు.




సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘం నాయకులు

పనిగంటల పెంపుపై ఐక్యపోరాటాలు

మంగళగిరి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది గంటల పని విధానాన్ని 13 గంటలకు పెంచుతూ చట్టసభల్లో తీసుకున్న నిర్ణయాలపై కార్మిక వర్గం సంఘటితమై ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీ నారాయణ పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని సంఘ కార్యాలయంలో బుధవారం పట్టణ 12వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ రోజుకు 13 గంటలు కార్మికులు పనిచేస్తే వారి జీవన విధానం దారుణంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల శ్రమను దోచే విధంగా కూటమి ప్రభుత్వ విధానాలు ఉన్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన కార్మికులు, ఉద్యోగుల 13 గంటల పని దినం చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26 వేల రూపాయలు అన్ని రకాల కార్మికులకు, స్కీమ్ వర్కర్లకు, అంగన్‌వాడీలకు, ఆశాలకు, మిడ్‌డే మీల్స్ కార్మికులకు అమలు చేయాలని తీర్మానం చేశారు. అనంతరం 41 మందితో పట్టణ కమిటీని ఏర్పాటు చేశారు. పట్టణ కన్వీనర్‌గా బాలాజీ, కో కన్వీనర్లుగా జవహర్ లాల్, జీవీ రాఘవులు, కమలాకర్, చెంగయ్య, బాలకృష్ణ, శ్రీరాములు తదితరులు ఎన్నికయ్యారు.

నీట మునిగిన పంట పొలాల పరిశీలన

తాడేపల్లి రూరల్: అధిక వర్షాల కారణంగా పంట పొలాలు నీట మునగకుండా సత్వరమే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీ పి.మధు డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండ, వడ్డేశ్వరం గ్రామాల్లో నీట మునిగి పొలాలను సీపీఎం నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ డ్రెయినేజీ బోర్డు నిర్లక్ష్యం కారణంగా పై ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయని అన్నారు. సంబంధిత అధికారులు పంట పొలాలు నీట మునుగుతున్నా పట్టీపట్టనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. కుంచనపల్లి గ్రామం అపర్ణ అపార్ట్‌మెంట్ నుంచి ప్రాతూరు, కుంచనపల్లి మీదుగా గుండిమెడ, మెల్లెంపూడి, వడ్డేశ్వరం, కొలనుకొండ, కేఎల్‌యూ వరకు ఉన్న పంట పొలాల డ్రెయినేజీ కాలువలు శుభ్రం చేయక పూడుకుపోవడం వలనే పంటలు ముంపునకు గురయ్యాయని అన్నారు. కేఎల్‌యూ నుంచి గుండిమెడ వైపు వెళ్లే రహదారి ఎత్తు పెంచడం వలన పంటపొలాలు పల్లానికి గురై, డ్రెయినేజీ కాలువలు పూడుకు పోయాయని, రైతులే రోడ్డుకు గండికొట్టి, వర్షపు నీటిని బయటకు పంపేందుకు చర్యలు చేపడుతున్నారని అన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించకుంటే రైతులను కూడగట్టి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ, నాయకులు నాగపోగు విజయరాజు, వడ్డేశ్వరం పార్టీ నాయకులు గుంపెన వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, కుంచనపల్లి రైతులు మేకల వెంకట శివయ్య, వలివేటి శ్రీనివాసరావు, మహిళా రైతు కొండ ఉష పాల్గొన్నారు.



పంటపొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎంపీ మధు

అతిసార బాధిత కుటుంబాలకు పరామర్శ

స్థానిక బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీలో అతిసార వ్యాధితో చికిత్స పొందుతున్న కుటుంబాలను సీపీఎం నాయకులు బుధవారం పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దుర్గారావు, వెంకటేశ్వరరావు, పరామర్శించిన వారిలో బీజేపీ నాయకులు ఈశ్వరనాయుడు, శివ, టీడీపీ నాయకులు వెంకన్న పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే బలం

ఎమ్మెల్సీ మురుగుడు, పార్టీ సమన్వయకర్త డీవీఆర్

మంగళగిరి టౌన్: వైఎస్సార్ సీపీని గ్రామ స్థాయి నుంచి పటిష్టం చేస్తూ కార్యకర్తలే కీలకంగా వ్యవహరించాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్) అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని 12వ వార్డులో బుధవారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఎద్దేవా చేశారు. అన్నదాతలను నట్టేట ముంచిన చంద్రబాబు, కూటమి ప్రభుత్వానిది సూపర్ దగా పాలన అని విమర్శించారు. స్థానిక నేతలతో కలసి వార్డులో పర్యటించి ప్రతి ఒక్క ఇంటికి వెళ్లి చంద్రబాబు మోసపూరిత పాలనను వివరించాలని కోరారు. రాష్ట్రంలో ప్రజా, రైతు వ్యతిరేక ప్రభుత్వం కొనసాగుతోందని పేర్కొన్నారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నమ్మి మోసపోయిన ప్రజలకు అండగా ఉంటామని, వారి తరుపున పోరాటం చేయడానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలకు గాలికి వదిలేసి కేవలం వైఎస్సార్ సీపీ శ్రేణులపై కక్ష్యసాధించే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో ప్రశ్నించే గొంతులపై తప్పుడు కేసులు బనాయిస్తూ తప్పుడు పాలన సాగిస్తున్నారని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేసి ప్రజలకు సంక్షేమ పాలన అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని కొనియాడారు. రాజకీయాల్లో వెన్నుపోటుకు ఆద్యుడిగా చంద్రబాబు పేరుగాంచారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి జనాల్లో తిరుగుతుంటే ప్రభంజనం మొదలైందని పసిగట్టిన చంద్రబాబు నాయుడు అండ్ బ్యాచ్ ఎలాగైనా జగనన్నపై అక్రమ కేసులు పెట్టాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు వైఎస్సార్ సీపీ పోరాడుతూనే ఉంటుందన్నారు. అనంతరం క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, రూరల్ అధ్యక్షులు నాలి వెంకటకృష్ణ, పట్టణ మహిళా విభాగ అధ్యక్షురాలు సంకె సునీత, గుంటూరు జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, జిల్లా చేనేత విభాగ అధ్యక్షులు ఊట్ల పాలశ్రీనివాసరావు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు మాతంగి బాబు, పట్టణ యువజన విభాగ అధ్యక్షులు మాదాల గోపి, పంచాయతీ విభాగం స్టేట్ సెక్రటరి ఫిరోజ్, నాయకులు బాజీ గంగాధరరావు, షేక్ మాబూ, కొసనం శ్రీనివాసరావు, సురేష్, దోగిపర్తి శ్రీనివాసరావు, జానీ, షబ్బీ, రఫీ, అన్వర్, టి. సుబ్బారావు, వల్లంశెట్టి విజయ్, రాచకొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డీవీఆర్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ హనుమంతరావు

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్ట్

మంగళగిరి: కార్పొరేషన్ పరిధి(ఎంటీఎంసీ)లో ద్విచక్రవాహనాలను దొంగతనం చేసిన ఆరుగురిని అరెస్ట్ చేశారు. రూరల్ సీఐ శ్రీనివాసరావు బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తుళ్లూరుకి చెందిన లేళ్ల పవన్‌తేజ, తేజావత్ ప్రకాష్, పెదల అంకమ్మ రాజు, ఉద్దండయురాయుని పాలేనికి చెందిన ఇసుకపల్లి దాసు, మర్రి నాగ మల్లేశ్వరరావులను అరెస్ట్ చేసి వీరి వద్ద నుంచి పది ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు. కేటీఎం బైక్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు తన ఇంటి ముందు నాగమల్లేశ్వరరావు బైక్‌ను పార్క్ చేసి ఉండగా గమనించి అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా వాస్తవాలు వెల్లడైనట్లు తెలిపారు.

సమాజ సేవే లక్ష్యం కావాలి

మంగళగిరి టౌన్: ఉన్నత చదువులు చదువుతున్న నేటి యువత నిస్వార్థంగా సమాజ సేవ లక్ష్యం కావాలని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి. నాగేశ్వరరావు అన్నారు. నగర పరిధిలోని కళాశాలలో బుధవారం నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ నేటి యువతకు చదువు, విజ్ఞానంతో పాటు సమాజంపై బాధ్యత, సేవాగుణం ఉండాలని సూచించారు. ఎన్ఎస్ఎస్‌లో సేవ చేయడం వలన వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని, ఆత్మవిశ్వాసంతో పాటు నాయకత్వ లక్షణాలు అలవడతాయని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ వ్యక్తిగత జీవితాన్ని మెరుగ్గా తీర్చిదిద్దుకోవడానికి ఎన్ఎస్ఎస్ ఉపయోగపడుతుందని అన్నారు. తమలో తాము సామాజిక, పౌర బాధ్యతల భావనను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ తాతారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు

కార్మికుల సమస్యపై ప్రభుత్వం స్పందించాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు తీర్పులు ఇచ్చినా కార్మికుల సమస్యపై ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉందని యూనియన్ నాయకులు కె.స్టీవెన్ అన్నారు. బుధవారం బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు సుభాని, అంకయ్య, సాంబశివరావు, నాగేశ్వరావులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ ప్రభుత్వానికి పైసా ఖర్చు లేకుండా వందలాది కార్మిక కుటుంబాల సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉన్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ ఇచ్చిన వాగ్దానం మేరకు కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, శారమ్మ, రమాదేవి, ఇమాంబీ, నవనీతం, రమాదేవి, రిబ్కా, దుర్గా భవాని పాల్గొన్నారు.

